కుంచె పక్కన పెట్టి, కుర్చీలో వెనక్కి జేరబడ్డాడు జనార్దనం.

దురదృష్టవంతుడి బతుకులోని నైరాశ్యంలా కమ్ముకువొస్తున్న తిమిరచ్ఛాయలను ఛేదించడానికి విఫల యత్నం చేస్తున్న వీధి దీపం తాలూకు ఒకటి రెండు కాంతి కిరణాలు బలహీనంగా గుమ్మంలోంచి లోపలికి పడుతున్నాయి. వీధిచివర డాక్టర్ గోపాలరావు గారి ఇంటి నుంచి సన్నాయి సంగీతం నవవధువు కంఠ ధ్వనిలా మెల్లిగా, మంద్ర స్వరంలో వినవస్తున్నది.

డాక్టర్ గోపాలరావుగారి – ఉహూ! శ్రీమతి సత్యవతిగారి ఏకైక పుత్రిక చి. సౌ. రాజేశ్వరి పెళ్ళి.

'ఇంకొకటి రెండు గంటలు' అనుకున్నాడు జనార్దనం. ఆ తర్వాత రాజేశ్వరి శ్రీమతి రాధాకృష్ణగా మారిపోతుంది. ఆ పిమ్మట ఏ దూరతీరాలకో రెక్కలు కట్టుకుని, లేక డబ్బెట్టి కొనుక్కుని ఎగిరిపోతుంది.

అందుకు ఊళ్ళోని పెద్దలు, [illegible] సామంతాది ప్రముఖులు, కనపడని దేవతలు ఆశీస్సులు, అభినందనలు అందజేస్తారు. వాళ్ళకు హక్కు, అర్హత వున్నాయి.

అందకు నోచుకోనిదల్లా తనువొక్కడే!

శ్రీమతి సత్యవతి స్వయానా జనార్దనం మేనమామ కూతురు. ఇప్పటి తనస్థితిలో ఆ మాట బైటికి అంటే అందరూ నవ్వుతారు అని నవ్వుకున్నాడు జనార్దనం.

ఆ పెళ్ళికి తనకి ఆహ్వానంలేదు. [illegible]స్తుందని తను ఆశించను కూడా లేదు. అయినా ఆ పెళ్ళి చూడాలని..

'ఆకలి వెయ్యడం లేదూ?' వెనుకనుంచి సావిత్రి గొంతు వినిపించింది.

జనార్దనం తల తిప్పి శుష్కవసవదనంతో భార్యని దగ్గరకి రమ్మని సైగ చేశాడు. సావిత్రి దగ్గరిగా వొచ్చి [illegible]టాలమూడ[illegible] తులు వేసి నవ్వుతూ మళ్ళీ అడిగింది: 'ఆకలి వెయ్యడం లేదూ?' అని.

'పాప భోంచేసిందా బుల్లీ?'

'ఊ! పాఠాలు చదువుకుంటోంది. వినపడ్డంలేదూ?'

'నీకు ఆకలి వేస్తోందా?'

'ఊహుఁ!'

జనార్దనం హుషారు తెచ్చుకుని 'ఈ నెగెటివ్‌కి, మరొక నెగెటివ్‌కి రంగు పట్టిస్తే పని పూర్తయి పోతుంది. అంతా ఫైవ్ మినిట్స్, ఆ తర్వాత...' అన్నాడు.

'కానివ్వండి.'




గూట్లోవున్న వారపత్రిక అందుకుని గోడ వారగా చతికిల పడ్డది సావిత్రి. రెండు నిమిషాలు పత్రిక తిరగేసి, విసుగు రాగా మూసేసింది.

భర్తని ఒక క్షణం క్రితం తాను అడిగిన ప్రశ్న గుర్తుకు రాగా, చిన్నగా నవ్వుకున్నది సావిత్రి. ఏడెనిమిదేళ్ళ క్రిందట, మద్రాసు మెరీనా బీచ్‌లో దాదాపు ఇదే వేళలో జనార్దనం ఇదే ప్రశ్న అడిగాడు. అనాడు ఆ ప్రశ్న తనకి రోషం, కోపం కలిగించింది.

పొట్ట పో[illegible]ంచుకునేందుకు మార్గాంతరం కనిపించక, ముసలితల్లిని వెంటబెట్టుకుని సావిత్రి మద్రాసు చేరుకున్న

తొలిరోజులవి. సినిమాల్లో ఎక్స్ట్రా వేషాలు వేసి డబ్బు సంపాదించాలన్నది అప్పట్లో ఆమె ధ్యేయం. పెద్ద పెద్ద వేషాలు వేసి 'కళా సేవ' చెయ్యాలన్న కోరిక ఆమెకు అప్పట్లో లేదు. కాని ఎక్స్ట్రా వేషాలు దొరకడానికి చాలా రకాల మతలబులూ, కైఫీయతులూ తెలిసివుండాలని ముందుగా ఊహించ లేకపోయిన సావిత్రి దాదాపు నెల రోజులపాటు తన పొట్ట మాడ్చుకుని, తల్లికి కలో గంజో పోయించడానికి నానా తిప్పలూ పడ్డది.



సావిత్రికి కళ్ళు మిరుమిట్లు గొలిపే సౌందర్యం లేదు. స్త్రీకి ఉండవలసిన అవయవాలు ఉండవలసినచోట్ల ఉండక పోయినా తారాపథానికి ఎగరవచ్చుననీ, అంతేకాక పుష్టి, నేవళం వున్నా గీత సరిగ్గా లేకపోతే ఎక్స్ట్రా వేషాలు కూడా దొరకవని సావిత్రి అచిరకాలంలోనే తెలుసుకున్నది. వేషాలు సంపాదించాలంటే ఏం చెయ్యాలోమరొక ఎక్స్ట్రా చెప్పగా విని తెలుసుకున్నది.

"పాపం! ఇది సినిమా లోకం! నీలో ఏముందో ఇక్కడోళ్లకి తెలియాలి. నేకపోతే నీ మొకంవోవరు సూత్తారూ? ఆ సెంట్రావతినూడు. తుమ్మబద్ద నాగుంటది. చిటం లోతారయిపోనాది. ఏంటంటావు బిస? ఆ జనార్దనం బాబు కాల్లట్టుకుని పత్రికల్లో ఫుటో ఏయించుకుంది. ఎవురో గోదారి జిల్లా కుర్రోళ్ళు సినిమాతీస్తాత ఫుటోసూసి గుబ్బైపోయి దానిని బుక్ సేసారు. ఇప్పుడు సూడు కార్లలో తిరుగుతుంది అదీ కత."

ఆ విధంగా జనార్దనం సంగతి తెలుసుకున్న సావిత్రి, ఆ తర్వాత నెల రోజుల దాకా అతన్ని కలుసుకోలేకపోయింది. ఒకరోజు సాయంత్రం మెరీనా బీచ్‌లో సినిమా షూటింగ్ జరిగితే దాంట్లో తనకు 'వేషం' ఉండటాన అక్కడికి వెళ్ళింది సావిత్రి. షూటింగ్ అయిపోయిం తర్వాత కాసేపు అక్కడ కూచోవాలనిపించి అందరూ వెళ్ళిపోయినా ఉండిపోయింది. ఒక అరగంట తర్వాత ఇంటి దగ్గర తల్లి ఎదురు చూస్తూ వుంటుందని గమనించి కొచ్చి బయలుదేరబోయిన సావిత్రికి యిసుకలో ఒక చోట ఒంటరిగా, నిస్త్రాణగా కూచుని వున్న జనార్దనం కనిపించాడు. ఒక క్షణం వెనుక ముందాడి చివరికి పలకరించింది.

"వేషాలకోసం వొచ్చారా?" అన్నాడతను.

తల వూపింది సావిత్రి.

"ఏమన్నా దొరికాయా?"

"చిన్న చిన్న వేషాలు."

"కడుపు నిండుతోందా?"

సావిత్రి జవాబు చెప్పలేదు.

ఒక క్షణం అతనేమీ మాట్లాడలేదు. ... చూస్తూ కూచున్నాడు. చివరికి చటుక్కున ఆమె వంక ... "ఆకలి ఎ ... లేదు ..."

సావిత్రికి రోషంతో ముఖం ఎర్రబడ్డది. సినిమా జనం పరిభాషలో "ఆకలి" అనే పదానికి మరో అర్థం వున్నదని ఎరిగిన సావిత్రి అతన్ని అసహ్యించుకున్నది కూడా. అయినా తమాయించుకుని "నాకు ఆకలి వేస్తోందా?" అన్నది.

"అవునండి! పొద్దుట్నించి ఏమీ తినలేదు."

సావిత్రి నిర్లక్ష్యంగా రొంటిలోంచి రూపాయి తీసి "నా దగ్గర ఉన్న డబ్బుల్లో కావాలంటే మీకు అర్థ రూపాయి సర్దగలను" అన్నది సాధ్యమైనంత కటువుగా, వెటకారంగా.

"ఇవ్వండి, ఇలా ఇవ్వండి" అంటూ ఆ రూపాయి లాక్కున్నాడు జనార్దనం. ఖజానావున్న కెమెరాని, మంగలి పెట్టెలావున్న ఫోటో కేసుని అక్కడే పడేసి రివ్వున పరిగెత్తాడు. రెండు నిమిషాల తర్వాత పొట్లాలతో తిరిగొచ్చి "సుండలు తెచ్చాను. బలే వుంటాయి, మీరూ తినండి" అని మిగతా అర్ధరూపాయి ఆమెకిచ్చేశాడు.

సావిత్రి తెల్లబోయింది. "నా కక్కర్లేదు" అన్నది మెల్లిగా.

"...ండిది" అంటూ అయిదు నిమిషాల్లో పొట్లాలు ఖాళీ చేశాడు జనార్దనం. అంతసేపూ అతని వంకే చూస్తూ కూచుంది సావిత్రి మౌనంగా. తినడం ముగించి, పొట్లాల కాయితాలతోనే చేతులు తుడుచుకుని "మీ మేలు ఈ జన్మలో మర్చిపోననుకోండి" అని అతనంటే సావిత్రికి సిగ్గుతో వొళ్ళంతా చచ్చినట్లయిపోయింది.

ఆ తర్వాత అతను చాలా కబుర్లు చెప్పాడు. ఆ కబుర్లన్నీ విన్న తర్వాత సావిత్రికి అతనిమీద పూర్తిగా సదభిప్రాయమే కలిగింది. అతనికీ తనకీ మల్లేనే సినిమాల మీద వెర్రిభ్రమ లేమీ లేవు. నాలుగు వేళ్ళూ నోట్లోకిపోవడం మినహా అతనికి మరొక ధ్యాస కూడా లేదు. "నా కేమిటండీ? వొంటరిగాడిని. పెళ్ళామూ పిల్లలా? మా సినీచంద్రిక ... యిచ్చేది బతకడానికి చాలు. నిన్న సంగతి మర్చిపోయాను. రేపటి గురించి దిగుల్లేదు" అన్నాడతను.

నవ్వింది సావిత్రి.

"అన్నట్టు యివాళ మీకు అర్ధ రూపాయి బాకీ పెట్టాను కదూ? మీ అడ్రస్ యివ్వండి. జీతం రాంగానే తెచ్చి యిస్తాను.

"అబ్బే! ఫర్వాలేదులెండి" అన్నది సావిత్రి.

"అలా కాదు. అప్పు అప్పే! అంత ... అయి మీరు రేపు నన్ను మీ ఇంటికి భోజనానికి పిలవండి. వొచ్చి నాలుగు కంచాలు లాగిస్తాను."

"మా ఇంట్లో కంచాలు లేవు" అన్నది సావిత్రి నవ్వుతూ.

"పోనీ విస్తళ్ళు... ఇంతకీ మీ అడ్రస్ చెప్పారు కాదు?"

సావిత్రి అడ్రస్ తీసుకుని "ఇందాకటి షూటింగ్ తాలూకు స్టిల్ ఒకటి తీశాను. అది కడిగేసి ఇవాళ్ళ వాళ్ళ మొహాన పారెయ్యాలి. మీ అర్ధరూపాయి ఎగ్గొట్టనులెండి. టాటా" అంటూ వెళ్ళిపోయాడతను. తను అడగదల్చుకున్నది అడగ లేకపోయానే అని సావిత్రి కొంచెం

[illegible], అతను తిరిగి తప్పక తనని కలుసుకుంటాడన్న నమ్మకం ఏర్పడటం వల్ల ఉపశమనం పొందింది.

పదిహేను రోజుల తర్వాత జనార్దనం నిజంగానే ఆమెని వెదుక్కుంటూ వొచ్చాడు. వొచ్చీ రావడంతోటే ఆమె వాళ్లోకి విసిరేసి 'మీ బాకీ చెల్లించేశాను. ఇప్పటికైనా నమ్ముతారా?' అన్నాడు.

'నా ఫొటో మీ పేపర్‌లో వేయిస్తారా?' అన్నది సావిత్రి జవాబుగా.

జనార్దనం ఆమె వంక ఎగాదిగా చూసి 'ఏమిటి?' అన్నాడు.

'మీ సినీ చంద్రికలో నా ఫొటో వేయిస్తారా అని అడుగుతున్నాను.'

'ఔననుకోండి. మరి...'

'చెప్పండి.'

'అంటే... అందులో వెయ్యడానికి పనికొచ్చేలా మీరు ఫొటో తీయించుకుంటారా?'

'తప్పకుండా.'

'ఛ-ఛ' అన్నాడతను.

సావిత్రి అతని వంక జాలిగా చూసి 'దయచేసి వేయించగలరా?' అన్నది


'ఎందుకు వేయించను? మరి ఫొటో తీయించుకుంటారా?'

'ఇప్పుడే తీయించుకుంటాను- మీకు అభ్యంతరం లేకపోతే'

'సరే! రెడీ అనండి'.

మరుసటి నెల సినీచంద్రికలో సావిత్రి ఫొటో పడ్డది. ఆ ఫొటోవల్ల సావిత్రి రాత్రికి రాత్రి పెద్దస్టార్ కాలేకపోయినా రెండునెల్ల గ్రాసానికిసరిపోను ఆదాయం తెచ్చిపెట్టిన నాలుగైదు బుకింగులు వొచ్చాయి. ఆ ఫొటో చూసినప్పుడు సావిత్రి 'నేనుఇంత అందంగావుంటానా?' అనుకుని ఆశ్చర్యపోయింది.

కొద్దిరోజులు గడిచాక సావిత్రికి తన ఫొటో ఆ పత్రికలో పడటానికి జనార్దనం పడ్డ తిప్పలు కర్ణాకర్ణిగా తెలియవచ్చాయి. జనార్దనం, ఆఫొటో వేయించడానికి తనజీతంలో కొంతభాగం పత్రికా యజమానులకి ముడుపుగా చెల్లించుకోవలసి వచ్చింది. ఆపైన అతను ఒకరిద్దరి ఎకసక్కాలకు గురి కావలసి వొచ్చింది కూడా! ఒక ఆడదానియందు ఒక మగవాడు అసక్తి కనబరిస్తే, శ్రద్ధ చూపిస్తే, మామూలుగా సంఘంలో ఆ మగవాడికి ఏం పేరు వొస్తుందో, సినిమా సంఘంలోకూడా జనార్దనానికి అదే పేరువొచ్చింది. చిత్రం ఏమిటంటే,



హావిస్

ఆ తర్వాత సావిత్రికి వొచ్చిన బుకింగ్‌లు తన గొప్పదనంగా, ఆ పత్రిక పబ్లిసిటీ ఇచ్చుకోవడం!

కాని, ఇవన్నీ అతి సామాన్యమైన విషయాలని, వీటినిగురించి అట్టే పట్టించుకోకూడదని జనార్దనం ఆమె తనని కలిసి ఈ సంగతులను గురించి అడిగినప్పుడు హితవు చెప్పాడు. తన కోసం అతను వొదిలించుకున్న డబ్బుని సావిత్రి ఇవ్వబోతే అతను వొద్దన్నాడు!

ఇంతలో ఉన్నట్లుండి ఆ పత్రిక మూత పడిపోయింది. ఎవరో తారమీద ఆ పత్రిక సంపాదక మహాశయుడు అవాకులూ, చెవాకులూ రాస్తే, ఆ తారామణి పరువు నష్టానికి దావా తెచ్చింది. ఆ దావాలో ఓడిపోయి, పరిహారం చెల్లించుకోవలసి వొచ్చేసరికి సంపాదకుడుగారు చేతులు పైకెత్తేశాడు!

జనార్దనం ఉద్యోగం ఊడిపోయింది!...

'నిద్రపోతున్నావా బుల్లీ?'

సావిత్రి చివాల్నలేచి 'మీ పని అయిపోయిందా?' అన్నది.

'నా పని సరే! పక్కింటి కామేశ్వరి ఇందాకటి నుంచీ నీ కోసం పిలుస్తోంది. అదుగో చూసిరా.'

'ఏదో పనికి సాయం కాబోలు. తీరికలేదని చెప్పొస్తాను'

'ఛ ఛ!... ఆ పనేదో చూసిరా'

'మీరు భోం చెయ్యరూ?'

'కాసేపు ఆగుతాన్లే'

'మీ ఇష్టం' లోపలికి వెళ్ళింది సావిత్రి.

'ఉత్తమ ఇల్లాలి నోయీ' అని కూనిరాగం తీస్తూ కుర్చీలోంచి లేచి వీధి గుమ్మంలోకి వొచ్చాడు జనార్దనం. గోపాలరావుగారి ఇంటినుంచి సన్నాయి సంగీతం వినవస్తూనే వుంది. రోడ్డుమీద అట్టే జన సంచారంలేదు. ఎవరో ఇద్దరు యువతులు, పట్టు చీరెలు రెపరెపలాడించుకుంటూ వడివడిగా నడిచిపోతున్నారు. 'పెళ్ళి వారింటికి కాబోలు' అనుకున్నాడు జనార్దనం.

అతను తిరిగి లోపలికివొచ్చి పడకగదిలోకి తొంగి చూశాడు. చదివి చదివి అలసిపోయిన పాప పుస్తకం గుండెల మీద పెట్టుకుని అలానే నిద్ర పోతుంది. జనార్దనం లోపలికివెళ్ళి ఆ పుస్తకాన్ని నెమ్మదిగా తొలగించి, పాప గుండెల దాకా దుప్పటికప్పి ఇవతలకివొచ్చాడు.

'పాప అక్కకి పెళ్ళి' నవ్వుకున్నాడతను.

ఔను! వరస అదేగా? సత్యవతి భర్త గోపాలరావు పాపకి పెద్దనాన్న (లేక పినతండ్రా?) అవుతాడు గదా?

**పదహారేళ్ళ క్రిందట...**

అప్పుడు జనార్దనానికి ఇరవయ్యేళ్ళు. సత్యవతికి పద్దెనిమిది. జనార్దనం, అతని తల్లి అప్పట్లో అతని మేనమామ గంగాధరం ఇంట్లోనే వుండేవారు. జనార్దనం తండ్రి నిక్షేపంలాంటి ఉద్యోగం వొదులుకుని, స్వాతంత్ర్యోద్యమంలో దూకి ఉన్నదంతా క్షవరం చేసుకున్నాడు. గంగాధరం దేశభక్తిని గురించి ఉపన్యాసాలిస్తూనే లాయర్‌గా లక్షలు ఆర్జించుకున్నాడు. ఆయనకి బావగారంటే అపరిమితమైన ప్రేమ, గౌరవం వుండేవనడంలో మాత్రం సందేహమేమీ లేదు. అందుకు చిహ్నంగా ఆయన తండ్రిని కోల్పోయిన జనార్దనాన్ని, విధవరాలైన తోబుట్టువును ఇంటికి తెచ్చి వుంచుకున్నాడు. జనార్దనం అక్కకి మంచి సంబంధంచూసి పెళ్ళిచేశాడు.

ఇంటర్ మీడియట్ రెండుసార్లు తప్పిన తర్వాత జనార్దనానికి చదువు మీద ధ్యాస సన్నగిల్లి పోయింది. కాలేజీలో చదువుతూండగానే ఫొటోగ్రఫీ వేపు మొగ్గింది అతని మనసు. అది కనిపెట్టిన గంగాధరం మంచి కెమెరా ఒకటి, ఫ్లాష్ వొకటి కొనిచ్చాడు మేనల్లుడికి. వాటితో రకరకాల ఫొటోలుతీస్తూ కాలక్షేపం చేస్తుండేవాడు జనార్దనం.

సత్యవతి ఇంటర్ రెండో సంవత్సరం చదువుతూండగా, జనార్దనం ఆమె కలిసి రాజమండ్రిలో ఎవరో బంధువులింటి పెళ్ళికి వెళ్ళారు. కేసుల హడావిడిలో ఊరు విడిచి కదలలేకపోయిన గంగాధరం, నిత్యరోగ పీడితురాలైన ఆయన భార్య కూతుర్ని మేనల్లుడివెంట పెళ్ళికి పంపించవలసి వొచ్చింది.

రాజమండ్రిలో పెళ్ళివారింట కాలు పెట్టినప్పటి నుంచీ జనార్దనానికి ఒక కొత్త రకం అనుభవం అడుగడుక్కీ ఎదురు కాసాగింది. జనార్దన్నంటే గంగాధరానికి అపేక్ష అని ఎరిగున్న బంధుగణం అతన్ని సత్యవతికి కాబోయే భర్తగా చూడటం సాగించారు. వాళ్ళ నమ్మకాన్ని ఖండించడం ఎలాగో అర్థం కాని జనార్దనం, వాళ్ళ మాటలకి తల వొంచక తప్పలేదు. సత్యవతి అగర్భ శ్రీమంతురాలు. ఆమెకితనకి పెళ్ళేమిటి? అసలెందుకు జరగాలి ఆ పెళ్ళి?

పెళ్ళయి పోయిన మరుసటి రోజు రాత్రి నూతనవధూవరుల స్నేహబృందం గోదావరి లంకల్లోకి "మూన్‌లైట్ ఫైర్" ఏర్పాటుచేశారు. ఆ పార్టీలో జనార్దనం, సత్యవతి చేరకతప్పలేదు.

ఆ రాత్రి, గోదావరీ గర్భంలోని లంకలు యువతీ యువకుల కేరింతలతో, ఆటపాటలతో దద్దరిల్లిపోయాయి. విజృంభించి కాస్తున్న వెన్నెల్లో, రెల్లు దుబ్బుల తివాచీమీద కొన్ని గంటల కాలం జీవితానందానికి నిర్వచనంలో



గడిచి కరిగి పోయింది. అర్థరాత్రి దాటిం తర్వాత అందరికీ అలుపు వొచ్చింది. ఎవరి జంటను వారు వెంటేసుకుని, ఏకాంతాలకు కదలిపోయారు.

జతకట్టని సత్యవతి, జనార్దనం ఆఖరుకు మిగిలిపోయారు.

"నీటికి దగ్గరగా పోదామా బావా?" అన్నది సత్యవతి.

జనార్దనం తల వూపాడు. ఎండిపోయిన గోదావరిలో అక్కడక్కడ కొంచెం పెద్దసైజు చలమల్లా నీటి మడుగులు మిగిలి వున్నాయి. ముందు సత్యవతి, వెనక జనార్దనం, నీటికి సమీపంగా వెళ్ళి ఇసుకలో చతికిల పడ్డారు.

"చాలా చల్లగా వుందిక్కడ" అన్నది సత్యవతి.

జనార్దనం నవ్వాడు.

"నీకు కవిత్వమన్నా రాదు" అన్నది సత్యవతి నవ్వుతూ.

"అదొక్కటే తక్కువ."

"ఇప్పుడు నీకేం తక్కువొచ్చింది బావా? ఎంత బాగా ఫొటోలుతీస్తావు? మొన్ననాన్న అన్నాడు – నువ్వు ఒకనాడు పెద్ద ఫొటోగ్రాఫర్‌వి అయిపోతావుట."

"నీ నోటి చలవన కావాలి గాని..."

"ఏమిస్తావు?"

"నీ ఇష్టం, నువ్వేది కోరుకుంటే అది."

"నే చెప్పిన అమ్మాయిని పెళ్ళి చేసుకుంటావా?"

తప్పకుండా."

సత్యవతి చటుక్కున అతని సరసకి చేరి చెయ్యిజాపి "వొట్టెయ్యి" అన్నది.

జనార్దనం ఆమె చేతిలో చెయ్యి వేశాడు.

"అయితే... నన్ను పెళ్ళి చేసుకుంటావా బావా?"

జనార్దనం తెల్లబోయాడు.

"ఔను బావా. నాకు ఎన్నాళ్ళనుంచో అడగాలని వుంది. నేనేమీ పసిపిల్లని కాను. అన్నీ ఆలోచించే అడుగుతున్నాను. ఇష్టమేనా?"

"నా వొక్కడి ఇష్టం చాలునా?"

"హుఁ! అదా? నాన్న, అమ్మ నా కోర్కె కాదంటారా! కాదంటే మాత్రం నువ్వూరుకుంటావా? అయినా నువ్వు మాత్రం పరాయి వాడివా?"

జనార్దనం మాట్లాడలేదు.

సత్యవతి అతని ముఖం తనవైపు తిప్పుకుని "అంగీకారంగా నన్ను ముద్దు పెట్టుకో బావా" అన్నది.

జనార్దనం నిశ్చలంగా ఆమెవైపు చూశాడు. ఆల్చిప్పలంత వున్న ఆమె కళ్ళు అంతటి వెన్నెల్లోనూ నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. దంతపు రంగులోవున్న ఆమె వొంటిలో తెల్ల జార్జెట్ చీర కలిసిపోయి వుంది. రేగిన ముంగురులు, తొలగినపైట -- ఎదురుగావున్న సౌందర్యాన్ని వేయింతలుచేసి అతని కంటిని, మనసుని, సర్వ చైతన్యాన్ని ఆకట్టి వేశాయి.

ఇదికలకాదు! అతనామెను గాఢంగా కౌగలించుకున్నాడు.

తెలతెలవారవస్తుండగా, తమకోసం మిత్రబృందం పెడుతున్న కేకలకి కళ్ళుతెరిచిన జనార్దనం, సత్యవతి కంగారుగా ఒకరి నుంచి ఒకరు విడిపోయారు.

ఇద్దరూ బట్టలు సర్దుకుని మౌనంగా అందరితో కలిసే ఇంటికి వొచ్చేశారు.

స్వంతవూర్తికి తిరిగొచ్చాక రెండు మూడు రోజుల పాటు జనార్దనం, సత్యవతి సాధ్యమైనంత దూరంగా తప్పుకు తప్పుకు తిరిగారు. బావా మరదళ్ళ కీచులాటలు ఇంట్లో అందరికీ కరతలామలకమే గనుక పెద్ద వాళ్ళెవరూ ఈసంగతి పట్టించుకోలేదు. నెల రోజులు గడిచిం తర్వాత...

ఆ రోజును తల్చుకుంటే జనార్దనానికి ఇప్పటికీ ఒళ్ళు జలదరిస్తుంది. సత్యవతి తల్లి నిలదీసేసరికి జరిగింది జరిగినట్టు చెప్పేసింది. తనకి బావని పెళ్ళిచేసుకోవాలని వున్నట్టుకూడా చెప్పేసింది. గంగాధరం మేనల్లుణ్ణిపిలిచి "నిజమేనా ?" అని అడిగాడు.

తల వూపాడు జనార్దనం.

"పొరపాటు చేశావు జనార్దనం" అన్నాడాయన నిర్వికారంగా.

జనార్దనం తలవొంచుకున్నాడు.

"నాకీ అభిప్రాయం ఎన్నడూలేదు. సరే! గత జల సేతు బంధనంవల్ల ప్రయోజనం ఏముంది? ఇందు. ఈ నాలుగువందలూ తీసుకుని, నువ్వూ అమ్మా ఇవాళ ఎక్కడకన్నా వెళ్ళిపోండి. సత్యవతికి వేరేసంబంధంచూసి వుంచాను. అయినవాళ్ళు, దగ్గరవాళ్ళు, మీరు లేకుండా దానిపెళ్ళి చెయ్యాల్సివస్తున్నది. ఏంచేస్తాం? ప్రాప్తం ఎంతో అంతే!"

"క్షమించు మామయ్యా."

"బావుందయ్యా! ఇందులో తప్పంతా నీ ఒక్కడిదేనా? ... అయినా ఎవరి ముచ్చట్లు వాళ్ళకుంటాయి గదా!"

జనార్దనం కదలబోయాడు.

"డబ్బు వదిలేశావు."

"ఒద్దులే."

"ఏడిశావులే!... ఇవాళే కాదు. ఎప్పుడు డబ్బు అవసరంవొచ్చినా ఉత్తరం రాయి, పంపిస్తాను. కాని ఇక్కడికి మాత్రం మీరిద్దరూ రాకండి"

ఆ రోజే జనార్దనం, అతని తల్లి ఆ ఊరు వొదిలిపెట్టారు. సత్యవతికోసం జనార్దనం కలయజూస్తుంటే "అది లోపల వుంది. మీరు వెళ్ళిపోయారని నేను చెబుతానులే. పదండి. బండికి టైమవుతోంది" అన్నాడు గంగాధరం.

జనార్దనానికి మేనమామ కళ్ళు తడిగా వుండటం కనిపించింది. ఆయన పాదాలకి నమస్కారంచేసి తల్లినితీసుకుని బయటికి వొచ్చాడు.

ఆ తర్వాత జనార్దనం జీవితం చాలా రకాల మలుపులు తిరిగింది. కొడుకుచేసిన "అపరిష్టపని" తల్చుకు కుములుతూ అతని తల్లి చాలా కొద్దికాలానికి పరలోకానికి వెళ్ళిపోయింది. గంగాధరం తన కూతురికి చాలా అందమైన కుర్రవాడ్నిచ్చి పెళ్ళిచేసి ఇల్లరికం తెచ్చుకున్నాడని, మెడిసిన్‌కూడా చెప్పించాడనీ జనార్దనానికి కర్ణాకర్ణిగా తెలియవచ్చింది.

అప్పటికతను మద్రాసులో సినీచంద్రిక ఫొటోగ్రాఫర్ ఉద్యోగంలో కుదురుకున్నాడు.

"సావిత్రి తనకక్కడ తటస్థపడక పోయి వుంటే ఏమైవుండేదా?" అని ఇప్పటికీ ఆలోచిస్తూనే వుంటాడు జనార్దనం. సినిమారంగభూమిలో రకరకాల మనుషులు తటస్థపడుతూవుంటారు. అందులో వేషాలకోసం వచ్చేవాళ్ళు చాలామంది వుంటారు. సావిత్రికూడా అలాగే పరిచయమైనా, ఆ అమ్మాయిలో సినిమా తార కావడానికి కావలసిన లక్షణాల కన్నా గృహిణికావలసిన లక్షణాలే ఎక్కువ కనిపించాయి అతనికి.

పొట్టపోసుకోడానికి డబ్బు సంపాదించ దల్చుకున్న ప్రతిమనిషి కొన్ని "త్యాగాలు" చెయ్యవలసివుంటుంది. సినిమాల్లో వేషాలు వేయదల్చుకున్న మనిషికి నైతికసూత్రాలనేవి అనుదదూరాన వుండాలి. బరి తెగించి బతకగలగాలి.

అందుకే, తన రికమెండేషన్ మీద కాస్త పెద్దవేషం ఇవ్వడానికి ఒప్పుకున్న ఒక ప్రొడ్యూసరు సావిత్రిని కోరాడని తెలిసినప్పుడు జనార్దనం ఆశ్చర్యపోలేదు. కాని ఆమె తిరస్కరించిందని తెలిసినప్పుడు అతను దాదాపు దిగ్భ్రాంతుడైనాడు.

ఆరోజున సావిత్రి కంటికి మంటికి ఏకధారగా ఏడుస్తూవుంటే ఆమెనెలా ఓదార్చాలో అర్థంకాలేదు జనార్దనానికి. సిగ్గుపడ్డాడుకూడా. బాధ కాస్త ఉపశమించాక "నన్ను మీరెక్కడికన్నా తీసుకుపోండి. ఈ దిక్కుమాలిన నగరంలో క్షణంకూడా ఉండలేను" అన్నది సావిత్రి.

"పదండి" అన్నాడు జనార్దనం.

ఆ రాత్రే ఇద్దరు మూటాముల్లె సర్దుకుని మద్రాసుకి గుడ్‌బై కొట్టారు. ఈ ఊరు చేరుకున్నారు...

"ఈ కొద్దిపాటి జీవితకాలంలో ఎన్ని అనుభవాలు!" అనుకున్నాడు జనార్దనం. ఈ ఊరు వచ్చినప్పటినుంచీ సత్యవతి "పెళ్ళయిన ఎనిమిది నెల్లకే పుట్టిన కుందనపు బొమ్మలా పెరిగిన" ఆమె కూతురు రాజేశ్వరి అడపాదడపా అతనికి కనిపిస్తూనే వున్నారు. ఆమె కనిపించినప్పుడల్లా తనని పలకరించాలని జనార్దనం ఆశించటం, ఆమె నిర్వికారంగా వెళ్ళిపోవడం జరుగుతూనే వుంది.

నవ్వుతూ లోపలినుంచి వచ్చిన సావిత్రిని చూసి "ఏమిటోయ్ విశేషం?" అన్నాడు జనార్దనం.

"కామేశ్వరి పెద్దకూతురు సమర్తాడింది. ఆ తల్లి ఇప్పటినుంచే ఆ పిల్ల పెళ్ళికోసం బెంగెట్టుకుంటోంది" అన్నది సావిత్రి.

"బావుంది. బెంగ కాదామరి?"

"మరే! మీరుకూడా పాప పెళ్ళికోసం మొదలెట్టండి" అని "ఇహనైనా భోజనానికి లేస్తారా?" అన్నది సావిత్రి.

"నేను రెడీ."

"రండి" అని వీధిలోకిచూసిన సావిత్రి "[illegible]! మీకోసం ఎవరో వచ్చారు" అని లోపలికి వెళ్ళిపోయింది.

జనార్దనం వచ్చిన కుర్రాణ్ణిచూసి "ఏమిటోయ్?" అన్నాడు.



డి.బి.యన్.ఫిలిమ్స్
ప్రైవేటు మాష్టారు
డైరెక్షన్ కె. విశ్వనాథ్ బి.ఎస్సి
రచన ముళ్లపూడి వెంకటరమణ
సంగీతం కె.వి. మహదేవన్
శ్రీ ఫిలింస్ విడుదల

"గురువుగారు గోపాలరావుగారింటి దగ్గర వున్నారుసార్! మిమ్మల్ని అర్జంటుగా పిల్చుకు రమ్మన్నారు."

"డాక్టర్ గోపాలరావుగారింటిదగ్గిరా? ఏమిటి విశేషం?"

"ఫ్లాష్ ఫెయిలయిందిట. మీ ఫ్లాష్ పట్టుకురమ్మన్నారు, అర్జంటు."

జనార్దనం ఒకక్షణం తటపటాయించి, ఆ తర్వాత ఫ్లాష్ తీసుకుని అతనివెంట బయలుదేరాడు. అనుకోకుండా రాజేశ్వరి పెళ్ళి చూడటానికి వచ్చిన ఈ అవకాశం పోదులుకోవడం అతనికి మనస్కరించక పోయింది.

పెళ్ళిపందిరి దేదీప్యమానంగా ప్రకాశించిపోతున్నది. ఐశ్వర్యానికి, ప్రధమ ప్రతినిధులైన మనుషులు అంతటా నిండి వున్నారు. లోపలికి ప్రవేశిస్తూనే జనార్దనం కళ్ళు సత్యవతికోసం నలుమూలలా వెదికాయి. ఆమె ఎక్కడా కానరాలేదు. ఫ్లాష్ చెడిపోయి నిరుత్సాహంగా వున్న సాటి ఫొటోగ్రాఫర్ అతన్నిచూసి "రక్షించావు బ్రదర్! నువ్వెంటావో వుండవోననీ హడిలి చచ్చాను. ఫ్లాష్ తెచ్చావా?" అన్నాడు.

ఫ్లాష్ తను అందిచ్చి "ఇహ నేను వెళ్ళిరావా?" అన్నాడు జనార్దనం.

"ఒక్కనిమిషం" అని అతను అవతలికి వెళ్ళి డాక్టర్ గోపాలరావుని వెంట పెట్టుకు వచ్చాడు. "ఇతను జనార్దనం అని నా స్నేహితుడు. మీరు ఎరగరుగాని చాలా మంచి ఫోటోగ్రాఫర్. నాఫ్లాష్ చెడిపోయింది. నేను స్టూడియోకి వెళ్ళి వస్తాను. అందాకా ఇతను ఫొటోలు తీస్తాడు. మీరేమీ కంగారుపడక్కర్లేదు. ఫోటోలు నేను గ్యారంటీ యిస్తున్నాను" అన్నాడు.

గోపాలరావు జనార్దనంవంక ఒకసారి ఎగాదిగా చూసి "మీరంతగా చెబుతే కాదంటానా? త్వరగా వచ్చేయండి" అని లోపలికి వెళ్ళిపోయాడు.

అతను జనార్దనాన్ని పక్కకిలాగి "నాకు ఇదే ముహూర్తానికి మరో ఆర్డర్ కూడా వుంది బ్రదర్. అందువల్ల నేను వెళ్తున్నాను. ఫొటోలు నువ్వేతీసెయ్యి. నీ ఋణం వుంచుకోనులే" అన్నాడు.

"నేను రాకపోతే ఏంచేద్దువోయ్? అయినా అంతిడబ్బ కక్కుర్తి..."

"నిజమే బ్రదర్". కాని ముద్దొచ్చినప్పుడే చంక నెక్కమన్నారు! అదీగాక జనార్దనుడు నాకు అండగా ఎప్పుడూ వుంటాడని నాకో గుడ్డినమ్మకం, వస్తాను" అనేసి చరచరా వెళ్ళిపోయాడతను.

మరో రెండునిమిషాలతర్వాత ధనుర్బాణాలు సంధించి రంగంలోకి దుమికాడు జనార్దనం. స్నేహితుడు వెడుతూ ఇచ్చిన రెండురీళ్ళు, అతనికి ఫొటోలు తీయడానికి ఎంత "స్కోప్" ఉన్నదో వివరించి చెప్పాడు. ఆహూతులైన పెద్దల్ని ఫొటోలు తీశాక అతను కళ్యాణమంటపందగ్గిరకివచ్చాడు.

మంటపంలో కూచునివున్న వరుణ్ని పరిశీలనగా చూశాడు జనార్దనం. "ఇతనా రాజేశ్వరి మొగుడు?" అనుకున్నాడతను. అతను నల్లగా, సన్నగా వున్నాడు అయితే ఏం? శ్రీమంతుల కులదీపకుడు. పెద్దచదువులో వున్నవాడు. ఏమైనా...

రెండు నిమిషాల తర్వాత, సత్యవతి, గోపాలరావు మంటపందగ్గరకి వచ్చారు. జనార్దనంవంక ఆమె ఒకసారి చూచి తల తిప్పేసుకున్నది. "కలవరపడకు సత్యవతీ! నేను నీతో మాట్లాడటానికి రాలేదు. నా కూతురు – అనగా – నీకూతురు పెళ్ళి ఫొటోలు తియ్యడానికి వచ్చాను" అనుకున్నాడు జనార్దనం.

పెళ్ళితంతు అంతా ముగిసేసరికి రెండు గంటలు పట్టింది. స్నేహితుడు ఇచ్చివెళ్ళిన ఫిలింరోల్సు పూర్తయిపోవటంతో చేసేదిలేక జనార్దనం ధనుర్బాణాలు కట్టేసి పందిట్లో ఖాళీగావున్న ఒక కుర్చీలో కూలబడ్డాడు. చదివింపులు అయిపోయినవాళ్ళు, ముహూర్తం మాత్రం చూడవచ్చినవాళ్ళు అంతా ఒక్కరొక్కరే వెళ్ళిపోసాగారు. అందులో ఒకరిద్దరు జనార్దనం ముఖపరిచయస్తులు అతనివంకచూసి సాభిప్రాయంగా చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయారు. జనార్దనానికిఅక్కడ్నించికదలబుద్ధికాలేదు. పెళ్ళిబట్టల్లో రాజేశ్వరి ఎంత అందంగా వుంది! ఆపిల్ల అచ్చం తల్లిపోలిక. తనకు కలగని అదృష్టం ఆ నల్లకుర్రాడికి కలిగినందుకు తను అసూయపడటం లేదు కదా!" అనుకుని నవ్వుకున్నాడతను.

కొద్దిసేపట్లో పందిరి మూడువంతులు ఖాళీ అయిపోయింది. జనార్దనం మెల్లిగా కుర్చీలోంచి లేచి లోపలి వైపు నడిచాడు. అంతాఎవరిహడావుడిలో వాళ్ళున్నారు. డాక్టర్ గోపాలరావు ఎవరో ఖద్దరు లాల్చీల ఆసాములని భోజనానికుండమని బలవంతం చేస్తున్నాడు. రాజేశ్వరి ఎక్కడవుందో? పసుపుతోనిండిపోయిన జుట్టుని సాపుచేసుకుంటూ ఏగదిలోనో వుండి వుంటుంది. వరసైనవాళ్ళు ఎగతాళిచేస్తూవుంటారు. ఉడుక్కుంటూనప్పుడు రాజేశ్వరి మొహం ఎలావుంటుందో?

జనార్దనం గుమ్మందాటి లోపలికి పోబోయి, ఎవరో ఎదురురాగా ఆగిపోయాడు. ఆ వచ్చినవ్యక్తి సత్యవతి.

ఆమె కూడా ఇతన్నిచూసి ఆగిపోయింది.

ఒకక్షణం జనార్దనం ఏమీ మాట్లాడలేదు. ఆతర్వాత నెమ్మదిగా "దాహంగా వుంది కాసిని మంచినీళ్ళు..." అన్నాడు.

సత్యవతి అతనివంక ఒకసారి చూసి "చిట్టెమ్మగారూ! ఈయనకి కాసిని మంచినీళ్ళుట ఇవ్వండి." చరచరావెళ్ళిపోయింది.

* * *

కొద్దినిమిషాల తర్వాత ఇంటిముఖం పట్టాడు జనార్దనం. డాక్టర్ గోపాలరావుగారి ఇంటి గేటు దాటుతుండగా అక్కడున్న వారెవరో "అంతే మాష్టారూ! అసమర్థుడ్ని ఆడదికూడా ఆదరించదు" అనిఅంటున్నమాటలు వినిపించాయి. ఆ క్షణాన అసంకల్పితంగా అక్కడఆగిపోరివంక చూసిన జనార్దనానికి ఎందుకో సావిత్రినీ, సత్యవతినీ పోల్చి ఆలోచించాలనిపించింది.

□□□